నేడు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

మానుకోట, న్యూస్‌టుడే: ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏకశిల హైస్కూల్‌లో జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్, సైన్స్ అధికారి బి. అప్పారావు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పొటెన్షియల్ కన్సర్న్స్ అనే అంశంపై ఈ సెమినార్ ఉంటుందన్నారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణోత్సవం



గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయం వద్ద భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. పూజలనంతరం స్వామివారి విగ్రహంతో పాటు శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలతో ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మపాలెం వాస్తవ్యులు మల్లం వంశీకులైన మల్లం వెంకటనారాయణ-కమల దంపతులు గ్రామం తరపున పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. పరుచూరి కుటుంబరావు, కనకలక్ష్మి దంపతులు రూ. 1.50 లక్షల విలువైన బంగారపు హారాన్ని అందజేశారు. హరి కృష్ణప్రణిత్, సాయిశ్రీవిద్య దంపతులు లడ్డూ వితరణ చేశారు. ఉదయం ట్రెజరీ జేడీ ఎ. నాగరాజు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ దృష్టికి విద్యార్థుల సమస్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్సీ తరగతి, వసతి, వంట గదులను పరిశీలించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు, ప్రధానాచార్యుడ్ని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు వెంకన్న, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, భారాస నాయకులు మార్నేని రఘు, కిరణ్, జేరిపోతుల వెంకన్న పాల్గొన్నారు.

భళా.. కళా ఉత్సవ్..!

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జిల్లాస్థాయి కళా ఉత్సవ్-2024 ఆనందోత్సవాల మధ్య జరిగింది. సంప్రదాయ, జానపద సంగీత, వాయిద్య, నృత్య, చిత్రకళ, నాటిక, కథలు చెప్పడం, సోలో, బృంద పాటలు, విజువల్ ఆర్ట్స్, ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో జరిగిన పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ కళా, సాంస్కృతిక, సృజనాత్మక నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించి ఔరా అనిపించారు. డీఈఓ రాజేశ్వర్, ఏఎంఓ అజాద్ చంద్రశేఖర్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, కార్యక్రమ కో-కన్వీనర్ శాంసన్‌సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీజే రాణి పాల్గొన్నారు.



జానపద నృత్యం



మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా చైతన్య నాటిక



బృంద నృత్యం

విజేతలు వీరే..

- గాత్ర సంగీతం: సోలో:పి. పవన్, బృందం: జడ్పీహెచ్ఎస్, చిల్లంచర్ల, వాయిద్య సంగీతం: ఈ. పవన్, అభిలాష్
- నృత్యం: సంప్రదాయ సోలో:సునయన, దివ్య, జానపద బృందం:అంకిత, పూజిత బృందం, జానపద సోలో: బి. దివ్య, ఎన్. శ్రీవిద్య,
- థియేటర్: జోగేశ్వర్, నాటిక: కృష్ణవేణి పాఠశాల, విజువల్ ఆర్ట్స్: బి. ఆనంద్, డి. శ్రావణి, బొమ్మలు: హేమంత్ కార్తీక్, శివచరణ్, కథలు చెప్పడం: జి. అక్షయ, సీహెచ్. వైష్ణవి.
- ప్రథమ స్థానం పొందిన వారు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొంటారని కార్యక్రమ కో-కన్వీనర్ శాంసన్‌సుధాకర్ తెలిపారు. డీఈవో రాజేశ్వర్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం

కిలోల్లో కొంటున్నారు టన్నుల్లో తరలిస్తున్నారు!

జోరుగా రేషన్ బియ్యం దందా..

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, నర్సంపేట, కమలాపూర్, వరంగల్ క్రైం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జోరుగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకూ ఇది విస్తరించింది..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 11,11,401 కార్డుదారులకు ప్రతి నెలా 2,266 చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 23 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో 2,250 టన్నులకుపైగా పక్కదారి పడుతోంది.



ఎలా చేస్తారంటే..

పేదల బియ్యంతో రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు, మిల్లర్లు.. పోలీసులకు చిక్కకుండా రకరకాల ఎత్తులు వేస్తున్నారు. రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి సేకరించిన రాయితీ బియ్యాన్ని టన్నుల కొద్దీ నిల్వ చేస్తారు. అర్ధరాత్రి లారీల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తారు.

టాస్క్‌ఫోర్స్

1 రేషన్ దుకాణాల ద్వారా..

లబ్ధిదారులు తమ కార్డును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి నెలా చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నట్లు వేలిముద్రలు వేసి వస్తున్నారు. దుకాణాదారుడు వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్క కట్టి డబ్బులు ఇస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కొందరు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులకు బదులు సబ్బులు, సర్ఫ్, గోధుమ పిండి, బోళ్ల సబ్బులు అందజేస్తున్నారు. అలా పోగైన బియ్యాన్ని మిల్లర్లకు రూ.14 నుంచి రూ.16 చొప్పున రాత్రి సమయంలో మిల్లులకు తరలిస్తున్నారు.

2 సన్నబియ్యంగా మార్చి

రేషన్ దుకాణాలతో పాటు ఇంటింటా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో సన్నబియ్యంగా మార్చుతున్నారు. అలా మరపట్టిన బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు.

3 నూకలుగా..

పౌల్ట్రీఫారాలు, బీర్ల తయారీ కంపెనీల్లో నూకల వినియోగం పెరిగింది. దీంతో వాటికి డిమాండ్ అధికమైంది. దళారులు లబ్ధిదారుల నుంచి రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లర్లకు రూ. 12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. నూకలుగా మరపట్టిన మిల్లర్లు కిలోకు రూ. 18 లేదా రూ.20 చొప్పున అవసరమున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ డివిజన్‌లో కొందరు అక్రమార్కులు సామర్థ్యం తక్కువ కలిగిన మిల్లులను స్థాపించుకుని బియ్యాన్ని నూకలుగా మరపడుతున్నారు.

సీఎంఆర్ లక్ష్యం కోసం..

వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా గూడూరు, కేసముద్రం, మరిపెడ, హనుమకొండ జిల్లా కమలాపూర్ తదితర మండలాల్లోని మిల్లర్లే చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు సమయంలో వారికి కేటాయించిన ధాన్యాన్ని అధిక ధరలకు పక్కదారి పట్టిస్తున్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు తక్కువ ధరకు లభించే పేదల బియ్యాన్ని టన్నుల కొద్ది కొనుగోలు చేస్తున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద లెక్కలు చూపిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఇదీ పరిస్థితి..



హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రవణ్‌కుమార్ బిన్నీ రైస్‌మిల్లరు రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌరసరఫరాలశాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు మిల్లుపై దాడి చేశారు. అందులో రూ.12.81 లక్షల విలువ చేసే 325 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు.



ఇది 30 టన్నుల రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ. ఇటీవల మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.

మాఫియాలా బియ్యం డాన్‌లు

ఉమ్మడి జిల్లాలో చౌక బియ్యం మాఫియా విస్తరిస్తోంది. జిల్లాకు ఇద్దరు నుంచి నలుగురు చొప్పున దందా చేస్తూ బియ్యం డాన్‌లుగా ఎదిగారు. యువత, మైనర్లు పావులుగా మారుతున్నారు. దళారులకు ద్విచక్రవాహనం, సంచులు, డిజిటల్ కాంటాలు అప్పగించి ఊళ్లలోకి పంపిస్తున్నారు. వారు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొంటారు. డిజిటల్ కాంటాలపై తూకాలు చేస్తున్నారు. బస్తా బరువు 50 కిలోలు కాగానే వాహనంపై తమ రహస్య ప్రదేశానికి తరలిస్తారు. ఇందుకోసం అక్రమార్కులు పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో ఒక వ్యక్తి చక్రం తిప్పుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులను మచ్చిక చేసుకొని ఆ ప్రాంతంలో దందాను కొనసాగించే ఇతరులను పట్టిస్తున్నారు. తాను మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 క్వింటాళ్ల చొప్పున ప్రయాణికుల ఆటోల్లో నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు.

● హనుమకొండ జిల్లాలో బడా దళారీ అక్రమానికి అడ్డూ అదుపు లేదు. మండలాల వారీగా మధ్యదళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు.



వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బస్తా 50 కిలోలు కాగానే స్కూటీపై తీసుకెళ్తున్న యువకులు

మహర్షి వాల్మీకి జయంతి



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నరసింహాస్వామి, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీడీ గ్రౌండ్‌వాటర్ వి.సురేష్, జిల్లా మత్స్యశాఖాధికారి వీరన్న, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, బాలకృష్ణ, డీపీఆర్‌వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల పనులు వేగవంతం



డోర్నకల్‌లో ప్రతిపాదిత క్యాంటీన్‌లో పనులు పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

డోర్నకల్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల పనులు వేగవంతం చేసినట్లు డీఆర్డీవో మధుసూదన్‌రాజు తెలిపారు. డోర్నకల్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణకు ప్రతిపాదిత ప్రదేశాన్ని గురువారం ఆయన సందర్శించి పనులు పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పనులు పూర్తి కాగానే ప్రారంభ తేదీ ఖరారు చేయనున్నట్లు చెప్పారు. వీటి ఏర్పాటుతో మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు సమకూరుతుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు నెలకొల్పుతున్నట్లు వివరించారు. సెర్ప్ ఏపీఎం మాలోతు శంకర్ నాయక్, నిర్వాహకులున్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో జిల్లా ముందుండాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేయడంలో జిల్లాను ముందుండేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. మురళీధర్ కోరారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మురళీధర్ మాట్లాడుతూ కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులు మలేరియా, డెంగీ, ఫైలేరియా, గన్యా బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉండే విధంగా ప్రజల్లో మార్పు తీసుకురావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీల, ప్రోగ్రాం అధికారి సుధీర్‌రెడ్డి, డాక్టర్ సారంగం, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, రవీందర్‌రావు, కేవీ. రాజు, పురుషోత్తం, శారద, రామకృష్ణ, వి. శ్రీనివాస్, రుక్మొద్దీన్ పాల్గొన్నారు.

మానుకోట కాంగ్రెస్‌లో వర్గపోరు!

చిచ్చురేపిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు

మహబూబాబాద్ శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బహిర్గతమైంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలకు ఇటీవల ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఆజ్యం పోశాయి.



నెల్లికుదురులో ఎమ్మెల్యే మురళీనాయక్‌తో వాగ్వాదం చేస్తున్న పార్టీ నేతలను సముదాయిస్తున్న పోలీసులు

మహబూబాబాద్, నెల్లికుదురు, న్యూస్‌టుడే: గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రకటించింది. స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు తమ అనుచరులనే కమిటీ సభ్యులుగా ఎంపిక చేసిన జాబితాను సంబంధిత అధికారులకు అందజేశారు. నియోజకవర్గంలోని అందరిని కలుపుకొని వెళ్లకుండా ఏకపక్షంగా సభ్యులను ఎంపిక చేయడమేమిటంటూ గురువారం నెల్లికుదురు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్ ఎదుట మరోవర్గం నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నెల్లికుదురు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. పార్టీ కోసం అందరు కష్టపడి పని చేస్తే ముగ్గురు నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారారని.. ఇలా వ్యవహరిస్తే పార్టీకే నష్టం జరుగుతుందంటూ విమర్శించారు. పాత, కొత్తవారిని సమన్వయం చేస్తూ అందరినీ కలుపుకొని వెళ్లాల్సిన ఎమ్మెల్యే మౌనంగా ఉండడం సరికాదని అన్నారు. మరోవైపు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్, పాలకవర్గ సభ్యుల నియామకంలో, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడి మార్పు విషయంలో పార్టీలో అంతర్గతంగా వివాదం రాజుకుంటోంది. ఈ నెల 6న నిర్వహించిన ఎమ్మెల్యే జన్మదినం వేడుకల సందర్భంగా కేసముద్రం మండలంలో ఆ పార్టీ నాయకులు రెండు చోట్లా వేర్వేరుగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఒక్క వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వెళ్లడం చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యసలహాదారు వేంనరేందర్‌రెడ్డి వర్గమంటూ నాయకులు, కార్యకర్తలపై ముద్రపడడం వర్గవిభేదాలకు దారితీస్తోంది. నెల్లికుదురులో జరిగిన నిరసన అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ ఒక వ్యవసాయ క్షేత్రంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశిస్తూ అందరికీ న్యాయం చేస్తానంటూ విడుదల చేసిన ప్రసంగం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.


గుడుంబా స్థావరాలపై దాడులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే, బృందం: జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం తెల్లవారుజామున గుడుంబా స్థావరాలపై పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 338 లీటర్ల నాటుసారా, 610 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని 5840 లీటర్ల బెల్లం, చక్కెర పానకం ధ్వంసం చేసి 33 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది మొత్తం 155 మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో గుడుంబా నియంత్రణకు పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గుడుంబా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల అనంతరం గ్రామాల్లో గుడుంబా వల్ల జరిగే అనర్థాలు, సైబర్ నేరాలతో పాటు లైంగిక దాడుల గురించి, నూతన చట్టాలు అమలు చేసే కఠిన శిక్షల గురించి వివరించారు.

వానమ్మా.. వందనం!

ముగిసిన నైరుతి.. మురిసిన ఓరుగల్లు

– న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



ఉమ్మడి వరంగల్ జిల్లాకు వానాకాలం కలిసి వచ్చింది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అన్నదాతలు అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జూన్‌లో మొదలైన నైరుతి సీజన్ సెప్టెంబరుతో ముగిసినా అక్టోబరు రెండో వారం వరకు అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

మండలాలవారీగా అధిక వర్షపాతం శాతం

మండలం	శాతం
మహబూబాబాద్	
చిన్న గూడూరు	117
మరిపెడ	100
నర్సింహులపేట	96
నెల్లికుదురు	60
దంతాలపల్లి	57
మహబూబాబాద్	44
కురవి	42
ములుగు	
ఏటూరునాగారం	101
మంగపేట	47
వెంకటాపురం	40
తాడ్వాయి	37
గోవిందరావుపేట	36
జనగామ	
కొడకండ్ల	50
జనగామ	24
భూపాలపల్లి	
మల్హార్‌రావు	30
కాటారం	28
రేగొండ	23
మహదేవ్‌పూర్	23
వరంగల్	
దుగ్గొండి	42
వర్ధన్నపేట	41
పర్వతగిరి	34
హనుమకొండ	
భీమదేవరపల్లి	34
ధర్మసాగర్	28
ఎల్కతుర్తి	24

సాగుబడికి చెరువుల నీరు

ఇది హసన్‌పర్తి మండలం నాగారం చెరువు. ఉమ్మడి జిల్లాలో 3,900 చెరువులు, కుంటలున్నాయి. ఈసారి 65 శాతం పూర్తి స్థాయిలో నిండాయి. మిగతావాటిలో 50 నుంచి 75 శాతం వరకు నీరు చేరింది. వీటికింద 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



జిల్లాల వారీగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షపాతం (మి.మీ.)

జిల్లా	సాధారణం	నమోదైంది
ములుగు	1200	1603.8
మహబూబాబాద్	878.0	1280.5
జయశంకర్	985.8	1159.8
వరంగల్	901.0	1082.5
హనుమకొండ	875.7	981.5
జనగామ	755.2	829.2

పంటలకు మేలు

- తోకల ఆదిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి



ఈసారి సకాలంలో వర్షాలు పడ్డాయి. యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. చెరువులతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వరి పంటకు నీరందించే అవకాశం ఉన్నందున యాసంగి సాగుపై ఆశలు పెంచుకున్నాం.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది

- రవీంద్రసింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురిశాయి. దీంతో జలశయాల్లోకి వరదనీరు చేరింది. నీరు లేని చెరువుల్లోకి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నింపుతారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుంది.



పంటలకు నీరు అందిస్తున్న రైతు




ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో నిండుగా వ్యవసాయ బావి

రైతులకు మద్దతుగా పత్తి కొనుగోళ్లు!

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధంగా ఉంది.. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం అని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు జేడీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

–ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే




మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్

? పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకొస్తే.. సీసీఐ కొనుగోలుచేస్తుందా? **- యాకూబ్, కొత్తూరు, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా**

✔ రైతులు పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకురావొద్దు. విడి పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో తీసుకురావడం వల్ల ఆ బస్తాల్లోని పోగులు పత్తిలో కలిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. స్పిన్నింగ్ చేసే సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

? ఈ ఏడాది అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కొంతమేర మచ్చ వచ్చి రంగు మారింది. పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉంది. ఇలాంటి పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందా? **- (శ్రీనివాస్, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా), (శివశంకర్, ఆత్మకూరు, హనుమకొండ జిల్లా), (సతీశ్, వెన్నారం, దొర్నకల్), (అన్నా తిరుపతి, ములుగు జిల్లా), (వెంకటేశ్వర్, దొర్నకల్), (తోట రాజేందర్, అబ్బాపూర్, ములుగుజిల్లా)**

✔ నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉంటేనే కనీస మద్దతు ధర రూ.7,521కు సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం సడలింపు, నాణ్యత లేకున్నా కొనుగోలు చేసే అవకాశం లేదు. రైతులు మొత్తం వచ్చిన దిగుబడిలో మంచి పత్తిని, నాణ్యత లేనిది వేరు చేయాలి. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందొచ్చు. మిగిలినది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ఉదయం కాకుండా మధ్యాహ్నం పత్తిని ఏరడం ద్వారా తేమశాతాన్ని తగ్గించొచ్చు.



? ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి దాన్ని సీసీఐకి విక్రయిస్తూ.. లబ్ధి పొందుతున్నారు. ఈసారి మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులను నియంత్రిస్తారా? **- (మహేశ్ హాజంపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా), (శ్రీనివాస్, ఖిలాషాపూర్, జనగాం జిల్లా)**

✔ ఈ ఏడాది నోటిఫై చేసిన మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తే. . సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటాం. సీసీఐ కాకుండా ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గుర్తిస్తే.. మిల్లుల్లో సమస్యలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నెంబర్ల ద్వారా సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ప్రైవేటు వేబ్రిడ్జిలకు, మిల్లుల్లోని వేబ్రిడ్జిలకు ఒక్కోసారి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దాంతో రైతులు నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలను ఎలా అరికడతారు? **- బుస్సారి లక్ష్మణ్, కంచరపల్లి, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా**

✔ మిల్లుల్లో పంట ఉత్పత్తుల తూకాల్లో ఉద్దేశపూర్వకంగా మోసాలకు పాల్పడితే సంబంధించిన వారిపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారులతో వేబ్రిడ్జిల తనిఖీలు నిర్వహిస్తానే. తూకాల్లో తేడాలొచ్చినట్లు అనుమానం వస్తే.. రైతులు.. తూనికలు, కొలతలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

తూనికలు, కొలతలు అధికారుల నెంబర్లు

జనగామ - 9440575081

హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా - 9963311956

వరంగల్ - 9885558028

మహబూబాబాద్ - 9177661663

? దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? **- బి.సాంబయ్య, నల్లబెల్లి, వరంగల్ జిల్లా**

✔ ఆరుగాలం పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దు. దగ్గరలోని మార్కెట్ కమిటీల్లో, సీసీఐ నోటిఫై చేసిన మిల్లుల్లో పత్తిని అమ్మడం ద్వారా మార్కెటింగ్‌శాఖ రైతు సరుకు జవాబుదారీగా ఉంటుంది. గిట్టుబాటు ధరతో పాటు నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లిస్తుంది. తరుగు పేరుతో దళారులు చేసే మోసాలకు మార్కెటింగ్‌శాఖ బాధ్యత వహించదు.

? పత్తి రైతుల కోసం మార్కెటింగ్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబరులో రైతు వ్యక్తిగత చరవాణి నెంబరు నమోదుచేసినా పండించిన పంట వివరాలు రావడం లేదు? **- రమేశ్, దేవరప్పుల, జనగామ జిల్లా**

✔ ఎన్ఐసీ ఇచ్చిన డేటా ఆధారంగా మార్కెటింగ్‌శాఖ పంట నమోదుచేసిన 21,65,326 మంది రైతులతో వాట్సాప్ నెంబరు (88972 81111)ను రూపొందించింది. ఈ నెంబరు సహాయంతో రైతులు సాగుచేసిన పత్తి వివరాలు, ఎన్ని క్వింటాళ్ల వరకు సీసీఐకు విక్రయించేందుకు అవకాశముంది.. తదితర వివరాలను ముందస్తుగా తెలుసుకోవచ్చు. ఇందులో రైతు వివరాలు రానంత మాత్రాన సీసీఐకు పంట విక్రయించవద్దనే నిబంధన లేదు.

? వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పండించిన పంట విస్తీర్ణం కన్నా.. తక్కువ నమోదు చేస్తే. . ఏంచేయాలి? **- రవీందర్, తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా**

✔ వ్యవసాయ అధికారులు నమోదు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగానే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం.. ఆధార్ నెంబరు ప్రామాణికీకరణ, రైతు వేలిముద్రలు, ఓటీపీ ద్వారా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసే అవకాశముంది. ఒకవేళ వ్యవసాయ విస్తరణాధికారులు సాగు విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేస్తే.. ఆ రైతులు సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాన్ని సీసీఐ అధికారులకు సమర్పించాలి.

19 నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి, న్యూస్‌టుడే: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 800 మంది హాజరవుతారన్నారు. బ్యాడ్మింటన్‌లో 12, హ్యాండ్ బాల్‌లో 14, కబడ్డీ 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీములు పాల్గొంటాయన్నారు. ప్రారంభం రోజు నుంచి పోటీలు ముగిసే వరకు మైదానంలో వాకర్స్‌కు అనుమతి లేదన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేశ్, పీడీ భాస్కర్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

ఇసుక దందాపై స్పందించిన కేటీఆర్



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 14 'ఇసుక దందా.. వారికి మామూలే' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని జతపరుస్తూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక మాఫియాకు అభయ హస్తం అంటూ వాగ్బాణాలు సంధించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆర్టీసీ బస్సులు రైట్.. రైట్..



హనుమకొండలోని నయింనగర్ కొత్త వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులు పరుగులు ప్రారంభించాయి. వంతెన నిర్మాణం పనులు పూర్తై, ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నా.. ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని, ఇతర రూట్లలో తిరగడంతో సమయం వృథా కావడంతో పాటు ప్రయాణికులకు టికెట్‌పై అదనపు భారం తప్పడం లేదంటూ 'ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తకు ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించారు. వంతెన మీదుగా బస్సులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్సులను ఈ మార్గంలో పంపించారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం ముందుగా బయలు బస్సులకు అదనపు ఛార్జి రూ.10 వసూలు చేశారని, తరవాత బస్సులకు అదనపు ఛార్జి తొలగించామని చెప్పారు. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా విద్యార్థులు, యువతి, యువకులకు జిల్లా, రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా ఈ మధ్య తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివితో తీసిన షార్ట్‌ఫిలిం పెన్‌డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22లోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్‌వోకు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెంచే అంశాలకు సంబంధించి గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన ఫొటోలు, షాట్‌ఫిలిం వీడియోలను మాత్రమే పంపించాలన్నారు. పూర్తి వివరాలకు పీఆర్‌వో సెల్ 87126-85050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వనదేవతల కటాక్షం.. మహా జాతర శాశ్వత పనులకు శ్రీకారం!



మేడారం మహాజాతర పనులు ఎప్పుడూ సమయానికి పూర్తి కావు.. జాతరకు ఐదారు నెలల ముందు సమావేశాలు నిర్వహించడం, రెండు నెలల ముందే నిధులు మంజూరు చేయడం, హడావుడిగా పనులు చేపట్టడం జరుగుతుండేది. ఈ ఆనవాయితీకి స్వస్తి పలికేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. జాతరతో సంబంధం లేకుండా మేడారంలో చేపట్టాల్సిన శాశ్వత పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. –తాడ్వాయి, న్యూస్‌టుడే(ములుగు జిల్లా)

మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి

మేడారం మహాజాతర 2026 ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది.. అంటే మరో ఏడాదిన్నర ఉంది.. గత అనుభవాల దృష్ట్యా మహాజాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఇప్పుడే ప్రత్యేక దృష్టిసారించారు. గత మే నెలలోనే జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏయే పనులు ఎప్పుడు చేయాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 4న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కార్యాచరణ ప్రారంభించిన కలెక్టర్

కలెక్టర్ టీఎస్.దివాకర ఇప్పటికే రెండు సార్లు జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన పనులను గుర్తించడం, గత జాతరలో ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తిస్థాయిలో వివిధ శాఖలను అడిగి తెలుసుకొన్నారు. గత జులై 11న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రూ.17.25 కోట్లు మంజూరు

గతంలో జాతర నిర్వహణకు కొద్దిరోజుల ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండేది. దీంతో అవి పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యేవి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈసారి అధికారులు ముందుగానే మేల్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంపించిన రూ.17.25 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ప్రతిపాదనలు.. మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

- సీఆర్ఆర్ పథకం ద్వారా కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 8
- మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు రోడ్డు విస్తరణ: 2.75
- ఎమ్మార్ పథకంలో నార్లాపురం చెక్‌పోస్టు నుంచి కాల్వపల్లి వరకు తారు దారి: 2.50
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 2
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు దారి: 2

వీటిలో కొన్ని టెండరు పూర్తయ్యాయి.. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్‌రావు తెలిపారు.

అతిథిగృహాల నిర్మాణానికి..



80 శాతం పూర్తయిన పూజారుల అతిథిగృహం

శాశ్వత ఏర్పాట్లే లక్ష్యంగా దేవాదాయశాఖ రూ.3.50 కోట్లతో అతిథిగృహాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహం 80 శాతం పూర్తయింది. భక్తులు, అతిథుల కోసం అతిథి గృహం నిర్మించేందుకు ప్రభుత్వం మరో రూ.2 కోట్లు మంజూరు చేసింది. రెండు రోజుల కిందట అధికారులు స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు.

19న జాతర పనులకు శంకుస్థాపన

రూ.7.35 కోట్లతో రెండు ప్యాకేజీలుగా చేపట్టే నార్లాపురం చెక్‌పోస్టు-కాల్వపల్లి, ఊరట్టం అమరవీరుల స్తూపం-ఊరట్టం, కన్నెపల్లి ఆర్చిగేటు-సారలమ్మ గుడి, మేడారం ఆర్‌అండ్‌బీ రోడ్డు-శివరాంసాగర్ చెరువు వరకు రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయింది. మంత్రి సీతక్క ఈ పనులకు 19న శంకుస్థాపన చేయనున్నారు.

ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్లుగా కౌన్సిలర్లను నియమించాలి



మహబూబాబాద్, న్యూస్‌టుడే: పుర పాలక సంఘంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో వార్డు కౌన్సిలర్లను వార్డు కమిటీ ఛైర్మన్లుగా నియమించి వారి సూచనలను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో భారాసకు చెందిన వార్డు కౌన్సిలర్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు కమిటీలు ఏర్పాటు చేస్తే సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో భారాస ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు ఎండీ.సలీం, గద్దె నిరజ, మార్నేని శ్రీదేవి, గోగుల అనూరాధ, పట్టం జ్యోతి, దాసరి హర్షిక, బత్తుల సరస్వతి, ఎండీ.ఫరీద పాల్గొన్నారు.

కుమురం భీం పోరాటం స్ఫూర్తిదాయకం

నెహ్రూసెంటర్, బయ్యారం, కొత్తగూడ, న్యూస్‌టుడే: జల్.. జంగిల్.. జమీన్ అంటూ కుమురం భీం చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని గిరిజన సామాజిక ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దళిత, గిరిజన, బహుజన సంఘాల ఆధ్వర్యంలో కుమురం భీం 84వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిషన్ నాయక్ మాట్లాడుతూ పోడు చేసుకుంటున్న ఆదివాసీ కుటుంబాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడుపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ప్రజా సంఘాల నాయకులున్నారు. ఆదివాసీ నాయకులతోపాటు వివిధ పార్టీల ఆధ్వర్యంలో జేకేపేట బస్టాండ్ కూడలిలోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టం వెంకటేశ్, భిక్షం, మమత రాజేష్, ప్రకాశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కొత్తగూడ మండలం గోపాలపురంలోని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. భీం చిత్రపటానికి పూలమాలవేసి నినాదాలు చేశారు. భీం ఉద్యమ చరిత్రను విద్యార్థులకు ఉపాధ్యాయుడు కల్తీ ఎల్లయ్య వివరించారు.



గోపాలపురంలో..



జిల్లా కేంద్రంలో



జేకేపేటలో

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14439
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్ కాలనీ ప్రధాన వీధిలో చెట్ల కొమ్మలు, వృక్షాలు పేరుకుపోయాయి. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **జగ్గయ్య**
సమాధానం: తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- డోలాగర్ స్వాతి, 26వ వార్డు కౌన్సిలర్.**

మహబూబాబాద్ టౌన్: స్థానిక కురవిగేటు రోడ్డు పైపు లైను అవసరంలో మంచినీటి పైపులైను లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. **- జంపాల సుమన్**
సమాధానం: రెండు రోజుల్లో మరమ్మతు చేయిస్తాం. **- నూనావత్ కుమార్, మున్సిపల్ ఏఈ.**

తొర్రూరు: బస్టాండ్ నుంచి పెద్దచెరువుకు వెళ్లే రోడ్డులో వీధిదీపాలు వెలగడం లేదు- **సోమయ్య, రవి**
సమాధానం: మరమ్మతు త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకుంటాం. **- రామచంద్రయ్య, మున్సిపల్ ఛైర్మన్, తొర్రూరు**

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: మార్కెట్ బజార్ యూనియన్ బ్యాంకు వెనుక వీధిలో మురుగు నీటి కాల్వల్లో వ్యర్థాలను తొలగించాలని శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్స్‌పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. మున్సిపల్ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

రహదారి శుభ్రం

డోర్నకల్: శాంతినగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు గురువారం తొలగించారు. ఆ మార్గాన బడులకు వెళ్లే విద్యార్థులతో పాటు పరిసర ఆవాసాల ప్రజలకు దుర్వాసన నుంచి విముక్తి కలిగింది.

మంచినీటి సరఫరాకు చర్యలు

తొర్రూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మెరుగైన మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ ఎస్‌ఈ ఎ.నరేందర్ తెలిపారు. స్థానిక మిషన్ భగీరథ అతిథి గృహంలో తొర్రూరు, పెద్దవంగర మండలాలకు చెందిన మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎస్‌ఈ హాజరై మాట్లాడారు. కుళాయిలు, చేతిపంపులు, బోరుబావుల నిర్వహణపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో ఏఈలు వెంకటేశ్వర రెడ్డి, యాకూబ్‌పాషా, నిరంజ్, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

తొర్రూరు, న్యూస్‌టుడే: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవం అయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని మడిపల్లికి చెందిన గిత్త సరిత పురిటి నొప్పులతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం వర్ధన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం అవడంతో ఈఎంటీ ఉదయ్‌కుమార్, పైలెట్ రమేశ్ శ్రమించి ప్రసవం చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చిందని తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.

తొర్రూరు డివిజన్

ఉద్యోగం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



తొర్రూరు, న్యూస్‌టుడే: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఇటీవల మృతిచెందిన కంఠాయపాలెం గ్రామ ఉపాధి హామీ క్షేత్రసహాయకుడు రమేశ్ సతీమణి రచనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పి, విస్మరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, యాకయ్య, సాంబయ్య, వెంకటేశ్వర్లు, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

కుంగిన దారులు..!

నర్సింహులపేట (మరిపెడ), న్యూస్‌టుడే: మండలంలోని పెద్దనాగారం గ్రామ శివారు నుంచి గోపాతండా వెళ్లే రహదారిలో, రామన్నగూడెం నుంచి కౌసల్యాదేవిపల్లి వరకు వెళ్లే రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. వరద నీరు పోవడానికి గతంలో రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు మోరీలతో వంతెనలు నిర్మించారు. గతంలో కురిసిన వర్షాలకు కొంత మేర కుంగిపోయాయి. గత ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ప్రమాదకరంగా మారింది. మూలమలుపులో రోడ్డు గుంతలు పడి కుంగడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గోపాతండా, పెద్దనాగారం, కౌసల్యాదేవిపల్లి, రామన్నగూడెం గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా రాకపోకలు కొనసాగిస్తారు. గుంతలుపడి రహదారులు కుంగిపోయి రెండు నెలలు కావస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు.



పెద్దనాగారం - గోపాతండా వెళ్లే రహదారి



రామన్నగూడెం - కౌసల్యాదేవిపల్లి దారిలో

షోయబుల్లాఖాన్‌కు నివాళి



మరిపెడ, నెహ్రూసెంటర్, గార్ల, న్యూస్‌టుడే: నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో ఎండగట్టి పత్రికయే వృత్తికి వన్నె తెచ్చిన అక్షర సేనాని షోయాబుల్లాఖాన్ అని పాత్రికేయులు కొనియాడారు. షోయబుల్లాఖాన్ జయంతి సందర్భంగా మరిపెడ, మానుకోట, గార్లలో పలువురు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గార్లలో తెలంగాణ స్మారక అమరవీరుల స్తూపం వద్ద చిత్రపటానికి నివాళులర్పించారు. విలేకరులతో పాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న తదితరులున్నారు.

మిషన్ భగీరథ పైపులైనుకు మరమ్మతు



డోర్నకల్, న్యూస్‌టుడే: జోగ్యాతండాలో పగిలిన మిషన్ భగీరథ పైపులైనుపై 'లీకేజీ...పట్టించుకునేవారేరి?' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన చిత్రవార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

ఓంకార్ ఆశయాలు యువతకు ఆదర్శం



గూడూరులో నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యు) నాయకులు

మహబూబాబాద్ రూరల్ (గూడూరు), న్యూస్‌టుడే: ప్రజాహక్కుల కోసం పోరాడిన ఓంకార్ ఆశయాలు యువతరానికి ఆదర్శమని ఎంసీపీఐ(యు) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ అన్నారు. గురువారం గూడూరులోని బస్టాండ్ కూడలిలో ఎంసీపీఐ(యు) మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యుడు మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపేందర్ మాట్లాడుతూ.. ఐదుసార్లు నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికైన ఓంకారు చేసిన సేవలు కొనియాడారు. ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి వీరస్వామి, నాయకులు బుచ్చిరామయ్య, ఈసం రామయ్య, సత్తయ్య, శ్రీరామ్, నవీన్, రాములు తదితరులున్నారు.

కేసముద్రం: ఓంకార్ చిత్రపటానికి పార్టీ మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి పూలమాలలు వేసి నివాళుర్పించారు. నాయకులు బిచ్చానాయక్, బానోతు రవి, బాదావతు శ్రీను, ప్రతాప్, నారాయణ పాల్గొన్నారు.

బేతోలులో జెండా పండగ



మహబూబాబాద్, నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని బేతోలులో గ్యార్వీ షరీఫ్(జెండా పండగను) గురువారం రాత్రి ముస్లింలు నిర్వహించారు. భక్తి, శ్రద్ధలతో జెండాలను గ్రామంలో ఊరేగించారు. మహబూబ్ సుభాని ఖాదార్‌బాబా దర్గాలకు గ్యార్వీ జెండాలను తీసుకువెళ్లి ప్రతిష్ఠించారు. దర్గావద్ద ప్రార్థనలు(ఫాతిహా) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు, ఖందిల్ కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్, మదార్, మైబు, నజీర్, ఖాజాపాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రచారం

మానుకోట, న్యూస్‌టుడే: ఉద్యోగుల, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. గురువారం ఆయన ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గురుకులాలు, కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో ప్రచారం

మరిపెడ: మండలంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు, ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ గురుకులాలు, కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

'డిజిటల్ క్రాప్ సర్వే' ఇతరులకు అప్పగించాలని వినతి



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఈఓలు

మానుకోట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేను ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తాత్కాలిక సహాయక సిబ్బందికి లేదా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని ప్రభుత్వాన్ని కోరుతూ జిల్లాలోని వ్యవసాయ శాఖ విస్తరణాధికారుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల్లో 42 రకాల పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఎలాంటి సహాయకులు లేకుండా డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహించడం కష్టమన్నారు. ఏఈఓలు చెలికాని రాజు, ఎం.రాజ్యలక్ష్మి, విజేందర్, సాయిచరణ్, సురేశ్, మనోజ్ తదితరులున్నారు.

చర్చలు వాయిదా

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న కూలీల రేట్ల పెంపు విషయంపై గురువారం మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి కార్మిక, రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. హమాలీ కార్మికులకు పెంచినట్లుగా ప్రస్తుత కూలీ రేట్లపై 20 శాతం పెంచేందుకు అంగీకరించారు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం సరకు నింపే సమయంలో కూలీలే బస్తా పట్టుకోవాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. కూలీలు వ్యతిరేకించడంతో చర్చలు సఫలం కాలేదు. ఏకాభిప్రాయం రాకపోవడంతో చర్చలను ఈ నెల 23కు వాయిదా వేశారు. సమావేశం అనంతరం కార్మిక సంఘాల నాయకులు శివారపు శ్రీధర్ మాట్లాడుతూ 23న చర్చలు సఫలం కాకపోతే 24 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

దంతాలపల్లి: డీఎస్సీ ద్వారా నియమితులైన కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. దంతాలపల్లి మండలానికి జిల్లా ఉన్నతాధికారులు 16 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. వీరిలో 15 మంది ఎమ్మార్సీ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఒక్కరు రిపోర్టు చేయాల్సి ఉందని ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు ఎంఈవో శ్రీదేవిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు.

సమయ పాలన పాటించాలి

దంతాలపల్లి: తూర్పుతండా శివారు రేఖ్యాతండా, రామవరంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈవో శ్రీదేవి గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో పలు రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు.

గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని నిరసన

కేసముద్రం: గ్యాస్ సిలిండర్లు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం ధన్నసరి గ్రామంలో వాహనాన్ని అడ్డుకొని ఆందోళన చేశారు. వినియోగదారులు మాట్లాడుతూ గ్యాస్ నమోదు చేశాక నాలుగు నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదన్నారు. నలభై మంది వినియోగదారులు నాలుగు నెలలుగా వేచి చూస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

నెల్లికుదురు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. నెల్లికుదురులో గురువారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నేతలు ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాగరాజు, బాలాజీనాయక్, శంకర్, సుందర్‌నాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించరూ!



డోర్నకల్‌లో వినతి పత్రం స్వీకరిస్తున్న సీడీపీవో

డోర్నకల్: డోర్నకల్‌లో అంగన్‌వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సీడీపీవోకి గురువారం వినతి పత్రం అందించారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు సరోజ, కార్యదర్శి లీలాదేవి తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు టీకాల పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యాదేవిపల్లి గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం గాలికుంటు టీకాలను మండల పశువైద్యాధికారిణి సౌమ్య పంపిణీ చేశారు. గ్రామంలో 350కు పైగా పశువులు, 49 గెదేలకు గాలికుంటు టీకాలు అందజేసినట్లు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో పతకాలు

మానుకోట: రంగోత్సవ్ స్వచ్ఛంద సంస్థ పాఠశాల విద్యార్థుల్లో చిత్రకళా నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహించి ప్రోత్సహిస్తోంది. జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికై పతకాలను సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.కోట్యానాయక్ తెలిపారు. నలుగురు బంగారు, నలుగురు రజత మరో ముగ్గురు కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందారన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కార్యకర్తలను గుర్తించాలి

నెల్లికుదురు: పార్టీ కోసం ప్రాణాలను సహితం లెక్కచేయకుండా, పాటుపడుతున్న కార్యకర్తలను మహబూబాబాద్ ఎమ్మెల్యే గుర్తించాలని కాంగ్రెస్ మహబూబాబాద్ బ్లాక్ అధ్యక్షుడు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సైదులు, మండల అధ్యక్షుడు ప్రభాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలోని రహదారులు భవనాల శాఖ విశ్రాంతి భవనంలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించుకోవాలనే ఉద్దేశ్యంతో కొందరు వర్గాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వారికి పార్టీ కార్యకర్తలు గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మురళీనాయక్ తీరు మార్చుకోవాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు యాకయ్య, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, నేతలు పాల్గొన్నారు.

ఎస్‌ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

మహబూబాబాద్‌రూరల్: ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న ఎస్‌ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని పర్వతగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మందుల శ్రీరాములు అన్నారు. గురువారం పర్వతగిరి కాంప్లెక్స్ పరిధిలోని సోమ్లాతండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు, ఎస్‌ఏ-1 పరీక్షలతో పాటు నవంబర్ 5న నిర్వహించనున్న ఎన్‌ఏఎస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పరీక్షలకు సంబంధించి మార్కులు, పాఠశాలలకు సంబంధించిన వివరాలను అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పనాదేవి, ఉపాధ్యాయులున్నారు.

మహాసభ గోడపత్రికల ఆవిష్కరణ



కొత్తగూడ: ఈ నెల 20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన మహాసభను జయప్రదం చేయాలని ప్రజాపంథా మాస్‌లైన్ నాయకుడు కొత్తపల్లి రవి కోరారు. హైదరాబాద్‌లో ఈ నెల 20న వీలిన మహాసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, ఐఎఫ్‌టీయూ సభ్యులు పెద్దమొత్తంలో పాల్గొనాలని సూచించారు. పార్టీ నాయకులు రాజు, పాపయ్య, మల్లేష్, అనిల్, సాంబయ్య, జంపయ్య, తదితరులున్నారు.

21 నుంచి బి-ఫార్మసీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ ఫార్మసీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి బి-ఫార్మసీ ప్రవేశాల కోసం ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ ఎం.స్వప్నరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఎంపిక క్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాల (టీఎస్‌పీడబ్ల్యూ)ను ఎంపిక చేసుకోవాలన్నారు. 25వ తేదీ వరకు తొలి విడత, నవబంర్ 5,6వ తేదీల్లో చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తలుపు ధ్వంసం

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని సింగారం ప్రభుత్వ పాఠశాల తులుపులు ధ్వంసం చేసిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలకు పండగ సెలవులు ఉన్న కారణంగా ఉపాధ్యాయులు తాళాలు వేసి ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు దసరా రోజున పాఠశాల కార్యాలయ తలుపులు తెరిచి అద్దం పగులగొట్టి పలు రిజిస్టర్లను చిందర వందర చేశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులను న్యూస్‌టుడే అడగగా సెలవుల మరుసటి రోజున పరిశీలించగా కార్యాలయం తలుపులు తీసి ఉన్నాయన్నారు. ఎలాంటి వస్తువులు అపహరణకు గురి కాలేదన్నారు. ఈ విషయమై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న చరవాణుల అప్పగింత

నర్సింహులపేట, న్యూస్‌టుడే: ఇటీవల మండలంలో పలువురు పోగొట్టుకున్న చరవాణులను నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధితులకు ఎస్సై మాలోతు సురేష్ అప్పగించారు. బాధితులు చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా దర్యాప్తు చేసి చరవాణులను యజమానులకు అందజేశారు.

ఇసుక డంప్ సీజ్

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సోమేశ్వర రైసు మిల్లు వెనుక ఉన్న ఆవరణ ప్రాంతంలో ఇసుక అక్రమ నిల్వను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆరు ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహబూబ్ అలీ తెలిపారు. సుమారుగా 20 ట్రిప్పుల ఇసుక ఉంటుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీ ఏర్పాటు తీరుపై నిరసన

బయ్యారం, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీల ఏర్పాటు తీరును వ్యతిరేకిస్తూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు ఆర్. భిక్షం, తుడుం వీరభద్రం మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో పథకాల్లో భాగంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కాంగ్రెస్ కార్యకర్తలకే అన్నట్లుగా ఉందన్నారు. రెండు పడకగదుల ఇళ్లను భారాస కార్యకర్తలు అమ్ముకున్న తీరుగానే ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్ధంగా కమిటీలను ఏర్పాటుచేసి నిరుపేదలకు ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాకేష్, తిరుమలేష్, లింగమల్లు, భూషన్‌రావు, రమేష్, మహేష్ పాల్గొన్నారు.



బయ్యారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సీఎండీ చొరవతో సమస్య పరిష్కారం

డోర్నకల్, న్యూస్‌టుడే: పెరుమాండ్లసంకీసలోని ఒక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడిన సమస్య సీఎండీ వరుణ్‌రెడ్డి చొరవతో పరిష్కారమైంది. గ్రామ రైతులు తెలిపిన వివరాలు ప్రకారం..గత శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బాషా అనే రైతు ఎడ్జ్ ఫీజు పోయిందేమోనని చూడటానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. దీని గురించి విద్యుత్తు అధికారులకు సమాచారం అందించి ఎర్త్ కోసమని రైతులు గుంతలు తవ్వారు. మూడు రోజులైనా అవసరమైన సామగ్రి రాలేదు. ఆరా తీస్తే సామగ్రి తీసుకెళ్లడానికి రైతులనే ఆటో తీసుకుని రమ్మనే సమాధానం వచ్చింది. కంగుతిన్న రైతులు విషయాన్ని స్థానిక రైతు మారెడ్డి నాగేందర్‌రెడ్డి ద్వారా సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో స్పందించడంతో సిబ్బంది వెంటనే పని పూర్తి చేశారు.

సత్తయ్య మృతికి నివాళి



కురవి, న్యూస్‌టుడే: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు తండ్రి సత్తయ్య మృతికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. కురవి మండలం బలపాలలో గురువారం జరిగిన సత్తయ్య దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు నాగేశ్వర్‌రావు, కుమార్తె ప్రమీలకు సంతాపం తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి విజయ్‌సారధి, జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, సభ్యులు హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి ప్రసాద్, ముండ్ల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి కోటయ్య, పిట్టల వెంకన్న, నామ సైదులు, రవి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

'కుమురం భీం విగ్రహంపై నిర్లక్ష్యం'

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రహదారుల విస్తరణలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో తొలగించిన కుమురం భీం విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించినప్పటికీ ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని.. విగ్రహానికి వేసిన ముసుగు తీయరా అంటూ పురపాలక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, 17వ వార్డు కౌన్సిలర్ ఎండీ.ఫరీద్ ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. సుమారు రూ. 10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రెండు నెలల కిందట పునఃప్రతిష్ఠించారని ప్రారంభానికి శిలాఫలకం ఏర్పాటు చేసి మరిచిపోయారని ఆరోపించారు. కుమురం భీం వర్ధంతి రోజు కూడా ఆ విగ్రహం ఎదుట కార్యక్రమాలు నిర్వహించకుండా ఆదివాసీ విప్లవయోధుడిని అవమానించేలా ఉందని విచారం వ్యక్తం చేశారు.